







రామోజీరావు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు



రామోజీ కుటుంబసభ్యులను ఓదారుస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు దంపతులు

# రామోజీ ఇకలేరు

> మొదటిపేజీ తరువాయి...

మొదలైన నూతనత్వాన్ని చివరిదాకా ప్రతి అడుగులో కొనసాగించారు. మొదట యాడ్ ఏజెన్సీలో ఆర్టిస్ట్‌గా ఢిల్లీలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన రామోజీరావు, అనంతరం వేలాది మందికి ఉద్యోగాలిచ్చే వ్యవస్థగా తనను తాను మలుచుకున్నారు. వ్యక్తిగా మొదలై వ్యవస్థలుగా రూపాంతరం చెందారు. 1967లో ఖమ్మంలో వసుంధర పేరుతో ఫర్టిలైజర్స్ వ్యాపారాన్ని ప్రారంభించి 1969 వరకు కొనసాగించారు. తర్వాత 'అన్నదాత' పేరుతో వ్యవసాయ మాసపత్రికను ప్రారంభించారు. అనంతరం మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థను నెలకొల్పారు.

### 1974 నుంచి అంచెలంచెలుగా ఈనాడు ప్రస్థానం

రామోజీరావు చీఫ్ ఎడిటర్‌గా 1974, ఆగస్టు 10న 'ఈనాడు' మొదలైంది. ఏ భారతీయ భాషా పత్రిక చేయని సాహసాన్ని ఈనాడు చేసింది. ఉమ్మడి రాష్ట్రంలోని అన్ని ప్రధాన కేంద్రాల నుంచే కాకుండా చెన్నై, బెంగుళూరు, ముంబై, ఢిల్లీ నగరాల నుంచి కూడా ప్రచురణను ప్రారంభించిన తొలి తెలుగుపత్రికగా నిలిచింది. 1974 నుంచి 'ఈనాడు తరం మొదలైంది' అనేలా పత్రికారంగ వ్యవస్థను రామోజీ తీర్చిదిద్దారు. వార్తల సేకరణ యంత్రాంగాన్ని పటిష్టం చేశారు. సర్క్యులేషన్ వ్యూహాన్ని సైతం పకడ్బందీగా అమలు చేశారు. 1978లో నవలతో చతుర, వివిధ భాషా కథల సమాహారంగా విపుల మాసపత్రికలు ప్రారంభించారు. 1989 జనవరి నుంచి జిల్లా అనుబంధాల (టాబ్లాయిడ్స్)ను ప్రారంభించారు. 1992 నుంచి మహిళల కోసం వసుంధర పేరుతో ప్రత్యేక పేజీని వెలువరించారు. పాత్రికేయులకు సమగ్ర శిక్షణ ఇస్తున్నా దానికో వ్యవస్థీకృత రూపం కావాలని ఈనాడు జర్నలిజం స్కూల్‌ను ప్రారంభించారు. సారా నిషేధం కోసం ఈనాడు మడమ తిప్పనిపోరాటం చేసింది. మద్యనిషేధం కోసం పాటలు, బ్యానర్లు రూపొందించి



రామోజీ పార్థివదేహానికి సతీమణి రమాదేవి అశ్రునివాళి

ప్రజల్లో చైతన్యం తెచ్చింది. మద్యనిషేధ ఉత్తర్వులు వచ్చే దాకా పోరు సాగించింది. ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమాన్ని పత్రిక భుజానికెత్తుకున్నది.

### తుఫాను బాధితులకు అండగా..

1977, నవంబరు 19న కృష్ణా జిల్లా దివిసీమలో పెను తుఫాను విధ్వంసం సృష్టించింది. ఈ విపత్తులో సర్వస్వం కోల్పోయిన బాధితులకు ఈనాడు ద్వారా రామోజీ అండగా నిలిచారు. ఈనాడు పిలుపుతో పోగైన సహాయనిధి రూ.7.5 లక్షలతో 112 ఇండ్లు కట్టించి పాలకాయతిప్ప గ్రామాన్ని పునర్నిర్మించారు. మిగిలిన సొమ్ముతో కోడూరు సమీపంలోని కృష్ణాపురంలో 22 ఇండ్లు నిర్మించారు. 1996 అక్టోబర్, నవంబర్‌లో దివిసీమలో జలప్రళయం వచ్చింది. రాష్ట్రంలోని అయిదు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. లక్షల హెక్టార్లలో పంటలు నాశనమయ్యాయి. గ్రామాలకు గ్రామాలే సమూలంగా తుడిచి పెట్టుకుపోయాయి. ఈనాడు సంస్థల తరపున రూ.25లక్షల విరాళమిస్తూ మానవతావాదులకు పిలుపునిచ్చారు. దీంతో కోటీ అరవై లక్షలు పోగయ్యాయి. తీర గ్రామాల్లో శాశ్వతంగా నిలిచేలా, ఆపద సమయాల్లో స్థానికులకు రక్షణ కల్పించేలా 42 సూర్య భవనాలను ఈనాడు ఆధ్వర్యంలో నిర్మించారు.

### అతిథి పాత్రలో రామోజీ

స్వతహాగా రామోజీ కళాభిమాని. చిన్నతనంలోనే ఊళ్లో నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాలుపంచుకునేవారు. సినిమాలంటే ఇష్టపడే ఆయన, 1978లో నిర్మించిన 'మార్పు' చిత్రంలో న్యాయమూర్తి పాత్ర పోషించారు. 1995లో ఈటీవీ తెలుగు చానల్‌ను ప్రారంభించి వెండి తెరకు బుల్లితెరను ప్రత్యామ్నాయం చేశారు. అప్పటి నుంచి తెలుగులో టీవీ వినోద రంగంలో పెనుమార్పులు వచ్చాయి. నేడు అన్ని భారతీయ భాషల్లో ఈటీవీ వినోదంతో పాటు న్యూస్‌చానళ్లు ప్రసారమవుతున్నాయి.

### పద్మవిభూషణుడు రామోజీ

ఆంధ్రా, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయాలు రామోజీరావుకు గౌరవ డాక్టరేట్లు ఇచ్చి సత్కరించాయి. బీడీ గోయంకా అవార్డును 2001లో రామోజీరావు అందుకున్నారు. అదే సంవత్సరం 'యుద్ధ్‌వీర్' అవార్డు, 1994లో పాత్రికేయ రంగానికి చేసిన విశిష్ట సేవలకుగాను కెప్టెన్ దుర్గాప్రసాద్ అవార్డుతోపాటు పద్మవిభూషణ్ పురస్కారం రామోజీని వరించింది.

### దవాఖానలో చికిత్స పొందుతూ..

హైదరాబాద్, జూన్ 8 : ఈనాడు మీడియా సంస్థల అధినేత, వ్యాపారవేత్త, సినీ నిర్మాత, జాతీయ చలనచిత్ర అవార్డు గ్రహీత, రామోజీ గ్రూప్స్ వ్యవస్థాపకుడు, పద్మవిభూషణ్ చెరుకూరి రామోజీరావు ఆనారోగ్యంతో నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని స్టార్ హాస్పిటల్‌లో శనివారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయన జూన్ 5న తీవ్ర గుండెపోటుతో హాస్పిటల్‌లోని ఎమర్జెన్సీలో చేరారని, హార్ట్ ఫెయిల్యూర్‌తో పాటు లోబీపీతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారని దవాఖానవర్గాలు తెలిపాయి. వెంటిలేటర్‌పై ఉంచి ఐఏబీపీ సాయంతో ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు యాంజియోగ్రామ్ టెస్ట్‌చేసి, స్టంట్‌వేశామని, అనుభవజ్ఞులైన కార్డియాలజిస్టులు, క్రిటికల్ కేర్ బృందాలు తీవ్రంగా శ్రమించినా ఫలితం దక్కలేదని వెల్లడించాయి.



ఫిల్మ్‌సిటీలోని నాగన్‌పల్లిలో నిర్మించిన స్మృతివనం

## బతికుండగానే స్మృతివనం

రామోజీరావు పార్థివదేహానికి ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లిలో ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరగనున్నాయి. ఆయన బతికుండగానే నాగన్‌పల్లి శివారులో ప్రత్యేకంగా స్మృతివనం నిర్మించుకోగా అక్కడే అంత్యక్రియలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లుచేశారు. అధికారిక లాంఛనాలతో రామోజీకి వీడ్కోలు పలికేందుకు రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ముగ్గురు ఐఏఎస్‌లను నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజత్‌భార్గవ, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జీ సాయిప్రసాద్, ఏపీ హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ ఆర్పీ సిసోడియా ఉన్నారు.

## ప్రముఖుల నివాళి

ఈనాడు సంస్థల అధినేత, పద్మవిభూషణ్ చెరుకూరి రామోజీరావు మృతి పట్ల రాజకీయ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పత్రిక, సినిమా, సాహిత్యరంగాల్లో ఆయన సేవలను స్మరించుకున్నారు. తెలుగు మీడియా రంగానికి కొత్త పంథాను నేర్పిన ఘనత రామోజీరావుకే దక్కుతుందని, తెలుగువారి కీర్తిని దేశ స్థాయిలో చాటిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ఆకాంక్షించారు. రామోజీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

రామోజీరావు మృతితో భారత మీడియా రంగం ఒక దిగ్గజాన్ని కోల్పోయింది. ఆయన సేవలు చిరకాలం గుర్తుంటాయి.
– ద్రౌపదీ ముర్ము, రాష్ట్రపతి

పత్రికా రంగం, సినీ పరిశ్రమపై రామోజీరావు చెరగని ముద్ర వేశారు. భారత పత్రికా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన దార్శనికుడు ఆయన.
– నరేంద్ర మోదీ, ప్రధాని

రామోజీరావు జర్నలిజం, సినిమా, వినోద రంగాలకు చేసిన సేవల ప్రభావం చిర కాలం ఉంటుంది.
– రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్ర నేత

రామోజీరావు మరణం తెలుగు ప్రజలకు తీరని లోటు. జర్నలిజం, ఎలక్ట్రానిక్ మీడియా, వ్యాపార రంగాలకు ఆయన అమూల్యమైన సేవలు అందించారు.
– నిర్మలా సీతారామన్

రామోజీరావు మృతి తెలుగు పత్రిక, వ్యాపార రంగాలకు తీరని లోటు. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయతను, దశదిశ చూపిన దార్శనికుడు రామోజీ. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, కుటుంబీకులకు సానుభూతి. –సీఎం రేవంత్‌రెడ్డి

### ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం: కేటీఆర్

స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న రామోజీరావు జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. ఫిలింసిటీలో ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. జీవితంలో ఎన్ని అవరోధాలు, అడ్డంకులెదురైనా గొప్ప విజయాలను ఎలా సాధించవచ్చో ఆయన ప్రస్థానం ద్వారా మనం నేర్చుకోవచ్చని వివరించారు. తెలుగు మీడియా, వినోదరంగాల్లో రామోజీ చెరగని ముద్ర వేశారని తెలిపారు. ఎంతో ఆప్యాయత కలిగిన రామోజీరావు అంటే తనకు చాలా గౌరవమని, దశాబ్ద కాలంలో చాలాసార్లు ఆయనతో మాట్లాడే అవకాశం రావటం తన అదృష్టంగా భావిస్తున్నానని, ఆయన మాటలు తనలో ఎంతో స్ఫూర్తి నింపాయని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

### నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన గొప్పవ్యక్తి : హరీశ్‌రావు

రామోజీ పార్థివదేహాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందని, తెలుగు ప్రజలకే కాకుండా దేశానికి ఆయన మరణం తీరని లోటు అని ఆవేదన వ్యక్తంచేశారు. సాధారణవ్యక్తిగా ప్రారంభమైన ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమని, నిరంతర శ్రమ, చెదరని ఆత్మస్థైర్యం, నిబద్ధత, క్రమశిక్షణ కలిగలిసిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించిన వ్యక్తి అని, సమాజ హితం కోసం మీడియా ద్వారా కృషి చేశారని వివరించారు. ఒక చిరుద్యోగిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి, వేల మందికి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదిగి ఎంతోమంది కుటుంబాల్లో వెలుగు నింపారని గుర్తుచేశారు. రామోజీరావు కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆశయాలను నెరవేర్చుకొనేందుకు రామోజీరావు చేసిన ప్రయత్నం అంతా ఇంతా కాదు. ఆయన మృతి తెలుగు జాతికి తీరని లోటు. ఒక మహా వ్యక్తిని, శక్తిని కోల్పోయాం.
– చిరంజీవి, ప్రముఖ సినీ నటుడు

## రామోజీ ఫిలిం సిటీ.. ఓ సినీ సామ్రాజ్యం

- లార్జెస్ట్ ఇంటిగ్రేటెడ్ ఫిలిం స్టూడియోగా ప్రపంచఖ్యాతి
- 'గిన్నిస్ వరల్డ్ రికార్డ్' సొంతం
- షార్ట్ ఫిలిం నుంచి 'హాలీవుడ్' సౌకర్యాలు
- పర్యాటక ప్రాంతంగా ప్రాచుర్యం




హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 8(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ అంటే గుర్తొచ్చేవి చారిత్రక కట్టడాలు, జంట జలాశయాలు, ఆకాశహర్మ్యాలే కాదు, లార్జెస్ట్ ఇంటిగ్రేటెడ్ ఫిల్మ్ సిటీ ఇన్ ది వరల్డ్‌గా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్న రామోజీ ఫిలింసిటీ కూడా! షార్ట్ ఫిలిం నుంచి హాలీవుడ్ సినిమాల దాకా చిత్రీకరించేందుకు అవసరమైన 24 క్రాఫ్ట్స్ కలిగిన ఏకైక కళాత్మక సినీ సామ్రాజ్యాన్ని మీడియా అధినేత రామోజీరావు 1996లో స్థాపించారు. 1983లోనే ఉషా కిరణ్ మూవీస్ ప్రొడక్షన్ హౌస్ నిర్మించిన ఆయన, సినిమా రంగానికి కావాల్సిన సౌకర్యాలు అందించేందుకు స్టూడియో నిర్మించారు. 1997లో తొలిసారిగా 'నాన్నకు మళ్లీ పెళ్లి' సినిమా ఫిలింసిటీలో తీశారు. దాదాపు రెండువేల ఎకరాల్లో రూపుదిద్దుకున్న ఈ అత్యద్భుత ఫిలింసిటీని తొలుత సినిమాల నిర్మాణానికే వినియోగించినా కాలక్రమంలో పర్యాటక ప్రాంతంగా అవతరించింది. నగర శివారులోని అబ్దుల్లాపూర్‌మెట్‌లో హాలీవుడ్ తరహా స్టూడియో కట్టాలని భావించిన రామోజీ, భూమిని సేకరించి ఇంటిగ్రేటెడ్ సినీ స్టూడియో నిర్మించారు. ఉషాకిరణ్ ప్రొడక్షన్ హౌస్‌తోపాటు, విశాలమైన కట్టడంగా తీర్చిదిద్దారు. సహజసిద్ధమైన కొండలు, గుట్టలను అల్లుకొని గార్డెన్లు, సినీ సెట్టింగులు, ప్రపంచ చారిత్రక కట్టడాల నమూనాలు, హోటళ్లు ఏర్పాటు చేశారు. ఫిలింసిటీలో 28ఏండ్లలో 2500కు పైగా సినిమాలు చిత్రీకరించారు. ప్రీ ప్రొడక్షన్ నుంచి పోస్ట్ ప్రొడక్షన్ దాకా సినీ రంగానికి కావాల్సిన అన్ని సదుపాయాలు ఉన్న ఫిలిం సిటీ, 'హబ్ ఆఫ్ మీడియా హౌసెస్'గా రూపాంతరం చెందింది. ఒక్కో సినిమా యూనిట్‌లో 200–250 మంది సినీ కార్మికులు ఉంటే.. ఏక కాలంలో 20కి పైగా సినిమాలను తెరకెక్కించేంత స్థాయిలో మౌలిక వసతులు కలిగి ఉంది.

### ఆఫర్డబుల్ హోటల్ నుంచి వరల్డ్‌క్లాస్ సూట్ వరకు...

పూర్తిస్థాయి సినీ అవసరాలను తీర్చే వేదికైన ఫిలింసిటీ, అనతి కాలంలోనే అంతర్జాతీయ స్థాయిలో పొందిన ఆదరణతో పర్యాటకప్రాంతంగా మారింది. అమ్యూజ్‌మెంట్ పార్కులు, గార్డెన్లు, ఢిల్లీలో ఉండే తాజ్‌మహల్ నమూనా, జపనీస్ గార్డెన్స్‌తో పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచింది. ఆఫర్డబుల్ హోటల్ నుంచి వరల్డ్‌క్లాస్ సూట్ కలిగిన ఏకైక సినీ సామ్రాజ్యంగా రామోజీ ఫిలింసిటీ అవతరించింది.

# నేడు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

### ఫిల్మ్‌సిటీలో 9 గంటలకు ప్రారంభం


హైదరాబాద్, జూన్ 8 (నమస్తే తెలంగాణ): రామోజీరావు అంత్యక్రియలు ఆదివారం ఉదయం ప్రభుత్వ అధికార లాంఛనాలతో రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి అంతిమ సంస్కారాలు ప్రారంభం కానున్నాయి. శనివారం రామోజీ ఫిల్మ్‌సిటీలోని కార్పొరేట్ భవన సముదాయంలో ఆయన పార్థివదేహాన్ని ఉంచగా.. పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు సందర్శించి ఘన నివాళి అర్పించారు. వారిలో ఏపీ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి, కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కొండా సురేఖ, సీతక్క, దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు ఉన్నారు. ఇంకా



మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డి జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి నివాళి అర్పించారు. సినీ ప్రముఖులు చిరంజీవి, ఇళయరాజా, ఎంఎం కీరవాణి, రాజమౌళి, మోహన్‌బాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, త్రివిక్రమ్, నరేశ్, మోహన్‌బాబు, విష్ణు, రాజేంద్రప్రసాద్, దగ్గుబాటి సురేశ్‌బాబు, నందమూరి కల్యాణ్‌రామ్, విజయేంద్రప్రసాద్, బోయపాటి శ్రీను, మురళీమోహన్, బ్రహ్మానందం శ్రద్ధాంజలి ఘటించారు. ఏపీ నేతలు పరిటాల సునీత, పితాని సత్యనారాయణ, అచ్చెన్నాయుడు, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, సుజనా చౌదరి, యలమంచిలి శివాజీ, వసంత వెంకట కృష్ణ ప్రసాద్, తెలంగాణ నాయకులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, దానం నాగేందర్, కడియం శ్రీహరి, పువ్వాడ నాగేశ్వరరావు, వివిధ పత్రికల ఎడిటర్లు, పలు చానెళ్ల అవుట్‌పుట్ ఎడిటర్స్, నమస్తే తెలంగాణ ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి నివాళి అర్పించారు. ఈనాడు సంస్థలు, రామోజీ గ్రూపుల్లో పనిచేస్తున్న సిబ్బంది, కుటుంబసభ్యులు, రామోజీరావు ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా సాయం పొందిన ఎంతోమంది ఆయనను కడసారి చూసేందుకు క్యూ కట్టారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ కిషన్‌రెడ్డి, ఎంపీలు బండి సంజయ్, ఈటల రాజేందర్, పలువురు బీఆర్‌ఎస్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రామోజీ సేవలను స్మరించుకున్నారు.

## పార్వతీ బరాజ్‌ను పరిశీలించిన ఘోష్ బృందం

మంథని రూరల్, జూన్ 8: పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురం గ్రామ పంచాయతీ పరిధిలో గల పార్వతీ బరాజ్‌ను విచారణ కమిటీ కమిషనర్, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్ శనివారం పరిశీలించారు.ఆయనతోపాటు బృందం సభ్యులు బరాజ్‌కు చేరుకొని పైనుంచి కింద భాగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఘోష్ అధికారులతో మాట్లాడి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. తర్వాత బరాజ్ కింది భాగానికి దిగిన ఘోష్.. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. గతంలో జరిగిన లోపాలు, ప్రస్తుతం జరుగుతున్న మరమ్మతు పనుల నివేదిక సోమవారం వరకు



పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని సుందిళ్ల బరాజ్‌ను సందర్శిస్తున్న జస్టిస్ ఘోష్

ఇవ్వాలని ఆదేశించారు. బరాజ్ సందర్శనకు ముందు రామగిరి మండలం సుందిళ్లలో ఉన్న లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో జస్టిస్ ఘోష్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఎస్ఈ కరుణాకర్, ఈఈ శ్రీధర్ ఓంకార్ సింగ్, డీఐవో శ్రీనివాస్, డీఈఈ లక్ష్మీనారాయణ, నరేశ్, ఏఈఈ విశ్వేశ్వర్‌రావు, శ్రీకాంత్ ఉన్నారు.

## మేడిగడ్డలో ఐదో రోజు పరిశోధనలు

### కొనసాగుతున్న మరమ్మతు పనులు

మహదేవపూర్, జూన్ 8 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోని మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌లో సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) నిపుణుల బృందం పరిశోధనలు శనివారం కూడా కొనసాగాయి. బరాజ్‌లోని లోపాల అధ్యయనానికి ఈ నిపుణుల బృందాన్ని నియమించిన విషయం తెలిసిందే. ఐదు రోజులుగా బరాజ్‌లో పలు రకాలు పరీక్షల నిమిత్తం శాంపిల్స్ సేకరిస్తున్నారు. మరో రెండు, మూడు రోజులపాటు పరిశోధనలు కొనసాగే అవకాశం ఉన్నదని ఇంజినీరింగ్ అధికారులు వెల్లడించారు. కుంగిన 19, 20, 21వ పియర్ల వద్ద భూగర్భంలో ఇసుక నమూనాలను సేకరిస్తున్నారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఆదేశాల మేరకు నిర్మాణ సంస్థ ఎల్‌టీ ఆధ్వర్యంలో బరాజ్‌లోని ఏడో బ్లాక్‌లో దెబ్బతిన్న పియర్ల వద్ద ఏర్పడిన ఖాళీ ప్రదేశాల్లో సిమెంట్, ఇసుక, కెమికల్ మిశ్రమాన్ని గ్రౌటింగ్ యంత్రాలతో పూడ్చుతున్నారు. బరాజ్ దిగువ ప్రాంతంలో నీటి ప్రవాహానికి పియర్ల చుట్టూ ఉన్న ఇసుక కొట్టుకుపోకుండా భారీ యంత్రాలు, క్రేన్ల సాయంతో షీట్ ఫైల్స్, సీసీ బ్లాకలను తీసి అమర్చుతున్నారు.



బరాజ్ ఏడో బ్లాక్ దిగువన షీట్ ఫైల్స్ అమరిక పనులు